పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 21: ఓయూ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 21: ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష తేదీలను మార్చినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు గతంలో ప్రకటించామని, పరీక్షలను అదే రోజు నుంచి నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ పరీక్ష తేదీలను మార్చినట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుడొచ్చని సూచించారు.

ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 21: ఓయూ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, మూడో సెమిస్టర్ మేకప్ పరీక్ష ఫీజును ఈనెల 25వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 28 వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూడొచ్చని సూచించారు.

సాగర తీరంలో కశ్మీర్ అందాలు

సాగర తీరంలో కశ్మీర్ అందాలను తలపిస్తూ నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన వింటర్ ఉత్సవ్ మేళా ఆకట్టుకుంది. గురువారం సాయంత్రం ఈ మేళాను ఎమ్మెల్యే దానం నాగేందర్, నిర్వాహకుడు మీర్జా రఫీక్ బేగ్‌తో కలిసి ప్రారంభించారు. సుమారు 200 స్టాళ్లలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులు, వస్త్రాలు, గృహోపకరణాలను అందుబాటులో ఉంచారు. కేరళ, గుజరాత్, మహారాష్ట్రకు చెందిన కార్మికులు కశ్మీర్‌ను పోలిన సెట్‌ను రూపొందించారు.

– ఖైరతాబాద్, నవంబర్ 21

కొనసాగుతున్న అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన

డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏ యూకి కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కొనసాగుతోన్నది. గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులంతా నిరసన కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ డా. వేణుగోపాల్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు. – బంజారాహిల్స్,నవంబర్ 21

రేషన్ లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు సరఫరా

సమావేశంలో సీఆర్ఓ ఫణీంద్ర రెడ్డితో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి , తదితరులు

జూబ్లీహిల్స్, నవంబర్ 21: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు సరఫరా చేసి సంతృప్తికరమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లైస్ విజిలెన్స్ కమిటీ మెంబర్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని చీఫ్ రేషనింగ్ కార్యాలయంలో సీఆర్ఓ ఫణీంద్ర రెడ్డి అధ్యక్షతన జరిగిన విజిలెన్స్ కమిటీ సమావేశంలో పాల్గొని లబ్ధిదారులకు అందించాల్సిన సేవలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ ప్రతినిధిగా పాల్గొన్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. రేషన్ పంపిణీపై నిఘా పెట్టడంతో పాటు అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారులకు సరైన తూకంతో.. నిర్దేశిత సమయాల్లో.. నాణ్యమైన సరుకులు అందించాలని సూచించారు.

ఘనంగా దుర్గామాతకు ప్రాణ ప్రతిష్ఠ

దేవాలయంలో చండీయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 21: అత్తాపూర్ డివిజన్‌లోని హైదర్‌గూడ శ్రీ దుర్గామాత దేవాలయం పునఃనిర్మాణం పూర్తైన సందర్భంగా గురువారం గణపతి హోమం, చండీ యాగం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహాబలేశ్వరంలో రూపొందించిన దుర్గామాత విగ్రహానికి బ్రాహ్మణ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్త చెట్టిగారి వసంతరావు ఆధ్వర్యంలో గణపతిహోమం, చండీయాగం కన్నుల పండుగగా చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహా, మల్లారెడ్డి, కొలన్ సుభాష్‌రెడ్డి, చెట్టిగారి నరేందర్, నారగూడెం మల్లారెడ్డి, వనం నర్సింహా, సోమారం రాజ్‌కుమార్, జయానంద్‌రెడ్డి, మేడం ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై అవగాహన

సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మసీ కళాశాలలో శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఫార్మసీ విద్యార్థులు

బంజారాహిల్స్, నవంబర్ 21: బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మా కళాశాల ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన 'క్లినికల్ రీసెర్చ్–డేటా మేనేజ్‌మెంట్– ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్' శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఫార్మసీ రంగంలో ఉన్న లేటెస్ట్ టెక్నాలజీ, డేటా మేనేజ్‌మెంట్‌తో పాటు రాబోయే రోజుల్లో క్లినికల్ ట్రయల్స్, పరిశోధనల్లో కీలకపాత్ర పోషించనున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ అంశాలపై ఫార్మసీ విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు శిక్షణను అందించారు. వివిధ సంస్థలకు చెంది న నిపుణులు ఈ శిక్షణా కార్యక్రమంలో కీలక సూచనలను విద్యార్థులు, ఫ్యాకల్టీలకు అందజేశారు. వివిధ కళాశాలలకు చెందిన వందలాదిమంది ఫార్మసీ విద్యార్థులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణను అందించిన నిపుణులకు సుల్తాన్ ఉల్ ఉ లూమ్ ఫార్మా కళాశాల ప్రిన్స్‌పాల్ డా.అనుపమ కోనేరు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు ముజీబుద్దీన్ షేక్, మితేష్ రెడ్డి, దేవానంద్ , తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్ ప్రభుత్వ స్కూల్ ఘటనపై విచారణ చేయాలి

హిమాయత్‌నగర్, నవంబర్ 21: నారాయణ పేట్ జిల్లాలోని మాగనూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ స్కూల్‌లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్రమైన విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు అందించే బియ్యం, నిత్యావసర వస్తువులు, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని తాము డిమాండ్ చేస్తున్నప్పటికీ నేటికి అమలు జరగడంలేదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివేవారు అధిక శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులే ఉన్నారని తెలిపారు. అస్వస్థతకుగురై దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి వారి తల్లిదండ్రులకు మనోధైర్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలికల పాఠశాలలో పరిశుభ్రత పనులు

జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు పాఠశాలలతోపాటు హాస్టళ్లు, ఆస్పత్రి ఆవరణల్లో శుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. ఈ మేరకు కమిషనర్ శరత్‌చంద్ర.. కాస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చేపట్టిన శుభ్రత పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, తదితర సిబ్బంది ఉన్నారు. – బండ్లగూడ, నవంబర్ 21

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవు

తొండుపల్లి సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమికి అనుకొని పోసిన మట్టిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్ దత్

శంషాబాద్ రూరల్, నవంబర్ 21: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరించారు. గురువారం శంషాబాద్ మండలం, తొండుపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నం.109లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు కొన్ని వార్త పత్రికల్లో రావడంతో స్పందించిన తహసీల్దార్ ..తొండుపల్లి రెవెన్యూ పరిధిలో పర్యటించి 109 సర్వే నంబర్‌లో 2.21 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా కాలేదని వివరించారు. సర్వే నిర్వహించి 2 ఎకరాల 21 గుంటల భూమికి బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో పాటు 108 సర్వే నంబర్‌లో 40 ఎకరాల భూమిని గతం లో స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన విషయం తెలిసిందే. పరిశీలించిన వారిలో ఆర్ఐ కృష్ణతో పాటు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ గోదాంలో అగ్ని ప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 21: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, టాటానగర్‌లోని ఓ ప్లాస్టిక్ గోదాంలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్, చాంద్రాయణగుట్ట అగ్నిమాపక కేంద్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తుంది. డివిజన్ పరిధిలో వారంలోనే ఈ ఘటన రెండవది. ఎలాంటి అనుమతులు లేకుండా స్క్రాప్ గోదాములను ఏర్పాటు చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇబ్బందులు పడుతున్నామని వెల్లడించారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన గోదాములపై చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థినికి ప్రేమ పేరుతో వేధింపులు .. కేసు నమోదు

వెంగల్‌రావునగర్, నవంబర్ 21 : పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని ప్రేమ పేరుతో వేధించాడు.. బాలికతో కలిసి దిగిన సెల్ఫీ ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించాడు..తనకిచ్చి పెండ్లి చేయాలని కుటుంబ సభ్యులపై ఒత్తిడి చేశాడు. నిలదీసిన ఆమె తల్లిని సైతం వేధించడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కథనం ప్రకారం.... మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే బాలిక (15) పదో తరగతి చదువుతున్నది. అదే ప్రాంతానికి చెందిన సంతోశ్ (30) ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. బాలికతో కలిసి సెల్ఫీ ఫొటో దిగాడు. బాలిక ఫోన్ నంబర్ సేకరించి తనను పెండ్లి చేసు కోవాలని వేధించసాగాడు. తనను పెండ్లి చేసుకోకుంటే తనతో దిగిన ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బ్లాక్‌మెయిల్‌కు దిగాడు. తన బాధను తల్లికి చెప్పుకోగా, ఆమె సంతోష్‌ను నిలదీయడంతో ఆమెను సైతం బెదిరించాడు. దీంతో బాలిక.. తన తల్లితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువతికి వేధింపులు.. వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, నవంబర్ 21: గతంలో ఉన్న పరిచయాన్ని అడ్డుగా పెట్టుకుని యువతిని వెంటపడి వేధిస్తుండడంతో పాటు ఆఫీసుకు వచ్చి అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసుల వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని ఓ చానెల్‌లో యాంకర్‌గా పనిచేస్తున్న యువతి(30)కి, హరీశ్ అనే వ్యక్తితో ఐదేళ్లుగా పరిచయం ఉంది. వారిద్దరూ గతంలో ప్రేమించుకున్నారు. అయితే ఏడాది క్రితం హరీశ్ వేరే అమ్మాయిని పెండ్లి చేసుకోవడంతో బాధిత యువతి అతడిని దూరం పెట్టింది. కాగా.. గత కొన్ని రోజులుగా హరీశ్ బాధిత యువతికి ఫోన్లు చేస్తుండడంతో పాటు వెంటపడి వేధిస్తున్నాడు. తనతో మాట్లాడవద్దని యువతి చెప్పినా వినిపించుకోకుండా మూడురోజుల క్రితం నేరుగా ఆమె పనిచేస్తున్న ఆఫీసువద్దకు వచ్చాడు. మద్యం మత్తులో తీవ్ర పదజాలంతో ఆమెను అసభ్యకరంగా దూషించాడు. నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ఫోన్‌లు చేస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి పోలీసుల కు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడు హరీశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జూబ్లీహిల్స్, నవంబర్ 21: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం వివిధ 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కాలనీ సబ్ స్టేషన్, వీఎల్‌సీసీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, షాపింగ్ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే.. రవీంద్ర సొసైటీ సబ్ స్టేషన్ , అయ్యన్న ప్రైడ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, బోరబండ సబ్‌స్టేషన్ గుట్టల బేగంపేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- బస్తీలు, కాలనీల్లో కొత్త డ్రైనేజీ పైపులైన్‌లు
- పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు
- చెత్త సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్



దుర్గానగర్‌లో స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 21: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని.. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నా రు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ , దుర్గానగర్‌లో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, శానిటేషన్, వెటర్నరీ, జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, దీంతో స్థానిక ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పాడైన డ్రైనేజీ వ్యవస్థను తొలగించి బస్తీలు, కాలనీల్లో కొత్త డ్రైనేజీ పైపులైన్‌లు వేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దు అని అధికారులకు సూచించారు. చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. చెత్త కారణంగా ప్రజలు అనేక రోగాల బారినపడే ప్రమాదం ఉందన్నారు. వీధికుక్కల బెడద సైతం అధికంగా ఉందన్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ మహిళలు, చిన్నారులపై దాడులకు పాల్పడుతున్నాయన్నారు. ఇటీవలే ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేశాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో మంచినీటి లోప్రెజర్ కారణంగా ప్రజలకు నీటి సమస్య అధికంగా ఏర్పడుతుందన్నారు. మరమ్మతులు చేసి ప్రజలకు నీరు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఇలా ప్రతి రోజు తనకు ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ప్రజలకు సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్, రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ రవికుమార్, వివిధ శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

నెక్నాంపూర్ గ్రామ దళిత కుటుంబాలు

మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నెక్నాంపూర్ గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు

మణికొండ, నవంబర్ 21: మా తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న స్థలాన్ని కబ్జాలు చేసి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నెక్నాంపూర్ గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు కోరాయి. ఈ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపట్టిన ఓ కౌన్సిలర్‌తో పాటు లేఅవుట్ చేపడుతున్న వారిపై గురువారం వారు మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెక్నాంపూర్‌లో సర్వే నంబర్ 20లోని భూమిని మా తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకొని జీవనం కొనసాగిస్తున్నామని, అయితే.. తమ స్థలాన్ని కబ్జా చేయడంతో హై కోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఈ స్థలం పక్కనే సర్వే నంబర్ 31లో సెక్రటేరియట్ కాలనీ ఉంది. అందులో 59 ఎకరాల భూమిని లేఅవుట్ ప్రకారం ప్లాట్లు చేసి ఇండ్లు కడు తున్నారు. కానీ ప్రస్తుతం సర్వే నంబర్ 20లో ని ఖాళీ స్థలంలో బైనంబర్లు వేసి విక్రయించారు. అలాగే స్థానిక ఓ కౌన్సిలర్ .. 300 గజాల స్థలంలో దర్జాగా ఇల్లు నిర్మించుకున్నారని, ఈ స్థలం లేఅవుట్‌లో లేదన్నారు. ఈ ప్లాటుపై మున్సిపల్ పర్మిషన్ రద్దు చేసి.. కట్టిన దాన్ని కూల్చివేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో పాకల కృష్ణ, కె.వీరయ్య, మల్లేశ్, శంకర్, ఎ.కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై విజయ్

హిమాయత్‌నగర్, నవంబర్ 21: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సిటీ సైబర్ పీఎస్ ఎస్సై విజయ్ సూచించారు. హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం హిమాయత్‌నగర్‌లోని న్యూ చైతన్య జూనియర్ కాలేజీలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక కాలంలో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోయిన నేపథ్యంలో వ్యక్తిగత సమాచారాన్ని లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని ఆగంతకులు పార్శిల్ వచ్చిందని, పార్ట్‌టైం ఉద్యోగం, లోన్స్ ఇస్తామని మాయ మాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారని, వారి కట్టడికి అప్రమత్తతే ఒక్కటే మార్గమన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీ, ఏటీఎం పిన్ నంబర్, సీవీవీ, బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పాలని కోరితే స్పందించవద్దన్నారు. ఏదో ఒక లింక్ పంపించి ఆశ పెట్టడం వల్ల విద్యావంతులే ఎక్కువశాతం మోసపోతున్నారని, ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ యూనిట్ కానిస్టేబుల్ ప్రణీత, భాస్కర్ పాల్గొన్నారు.

24నుంచి టీటీడీలో గీతా జయంతి మహోత్సవాలు

హిమాయత్‌నగర్, నవంబర్ 21: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి డిసెంబర్ 11వరకు హిమాయత్ నగర్‌లోని బాలాజీ భవన్‌లో గీతా జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ సహాయ కార్యనిర్వహణ అధికారి చతుర్వేదుల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఒక్కొక్క అధ్యాయం పారాయణం చేసి ప్రముఖ పండితులచే ప్రవచనాలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భగవంతుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

రంగస్థల స్వరోత్సవం అభినందనీయం

చిక్కడపల్లి, నవంబర్ 20: రోశిరెడ్డి రంగస్థల స్వరోత్సవం అభినందనీయం అని విశ్రాంత ఐఏఎస్, డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరైన మాట్లాడారు. ఎన్నో కష్ట నష్టాలకోర్చి నాటకాన్ని మాత్రమే జీవితంగా భావించిన రోశిరెడ్డి పట్టుదల అంకితభావం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. భక్త చింతామణి నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు.

PUBLIC NOTICE

General public is hereby informed that **D.Vijaya Lakshmi, W/o. Dharanidhar, R/o. Hyderabad,** owner and possessor has agreed to sell his **Open Plot No's 11, & 11 A, land in Sy.Nos.748 & 749 total admeasuring 640 Square Yards or 535.56 Square Mtrs., situated at RANGA REDDY NAGAR,** Adjacent to Mission Compound, **SHAMSHABAD MUNICIPALITY, Ranga Reddy District, T.S.,** Covered by Ward & Block No.21 and bounded on **North:33-0 FT WIDE ROAD; on South: PARK; on East: PLOT NOS.12 & 13 and on West: 40-0-FT WIDE ROAD** to my clients free from all sorts of encumbrances and charges. Any person (s) having any right, title and interest over the said property shall contact the undersigned with all the document in support of his/her/their claim **within Seven days** from the date of Publication of this notice failing which my client will proceed further for complete the remaining sale formalities and the objection received thereafter shall be deemed to have been waived to an intents and purposes.

SURESH UPADHYAY B.Com., LL.B.
ADVOCATE
1-1-651/8-12, 2nd Flr., Gandhinagar, Hyd-80.
M: 6304732833, 9494408460